క్లుప్తంగా

విజయవంతంగా లీడ్‌లెస్ పేస్‌మేకర్ ఇన్‌సర్షన్



రోగి గుండెలో లీడ్‌లెస్ పేస్‌మేకర్ అమర్చుతున్న వైద్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని ట్రస్ట్ మల్టీ స్పెషలిస్ట్ ఆస్పత్రిలో తొలిసారిగా లీడ్‌లెస్ పేస్‌మేకర్ ఇన్‌సర్షన్ విజయవంతంగా నిర్వహించినట్టు ఈడీ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. అమెరికాకు చెందిన కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ డాక్టర్ ఇలానా బి.కుటిన్స్కి, ట్రస్ట్ ఆస్పత్రి డాక్టర్ చంద్రమౌళి, క్యాథ్‌ల్యాబ్ బృందం నిపుణులు రోగి గుండెలో వన్ పీస్ పరికరం లీడ్‌లెస్ పేస్‌మేకర్‌ను గురువారం విజయవంతంగా అమర్చారు. పరికరం నుంచి వచ్చే సంకేతాల ద్వారా సాధారణంగా కొట్టుకుంటుందని వైద్యులు వివరించారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యం



శాస్త్రీయ నృత్యం చేస్తున్న దెందులూరి పద్మమోహన్ బృందం కళాకారులు

బోట్‌క్లబ్: సరస్వతి గానసభ 120వ దసరా సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన దెందులూరి పద్మమోహన్ బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. స్థానిక సూర్యకళా మందిరంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. భామాకలాపంతో పాటు వివిధ అంశాలను రసవత్తరంగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. కళాకారులు మాధురి, స్రవంతి, కల్పన, సునీల, నిఖిత నాట్య ప్రదర్శన చేశారు. వీరికి గాత్రంతో రమా జగన్నాథ్, వయొలిన్‌తో మహావాదివాసు శాస్త్రి, మృదంగంతో జనార్దన్, వీరాస్వామి సహకరించారు.

జగన్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరిస్తాం : నాదెండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్. చిత్రంలో నాయకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు జగన్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కాకినాడలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి విద్యార్థులకు టోఫెల్ శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం ఐవోబీ అనే సంస్థతో ఒప్పందానికి సిద్ధమైందని, ఇందులో క్విడ్‌ప్రోకో ఉందని ఆరోపించారు. ఉపాధ్యాయులకు నెలజీతం సరిగా ఇవ్వకపోగా, భారీస్థాయిలో ఖర్చు పెట్టడానికి సిద్ధమవ్వడం వెనుక కారణం అర్థమవుతోందన్నారు. అధికారులు దీన్ని వ్యతిరేకించినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏదైనా కాంట్రాక్ట్ రూ.100 కోట్లు దాటితే జ్యూడిషియల్ అనుమతులు కోరతామని గతంలో ప్రకటించి ఇప్పుడు లోపాయికారిగా ఒప్పందం చేసుకుంటున్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సామరస్యంగా ప్రార్థనలు జరుపుకోవాలి

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థన ఆరాధన సమయాల విషయమై తరచూ వివాదం తలెత్తుతున్న నేపథ్యంలో చర్చి ప్రతి నిధులతో గురువారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. త్వరలో చర్చికి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సామరస్యంగా, సౌభ్రాతృత్వంతో ప్రార్థనలు జరుపుకోవాలని చర్చి సభ్యులకు సూచించారు. వన్ టౌన్ సీఐ వి సురేష్‌బాబు, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కాకినాడ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ప్రజలను అవగాహన కల్పించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. గురువారం సాయంత్రం సీజనల్ వ్యాధులు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి కాలుష్య వ్యాధులపై ప్రజలను అవగాహన కలిగించాలన్నారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజారోగ్య విభాగానికి అవసరమైన పరికరాలపై నివేదిక ఇవ్వాలని కోరారు.



జపమాల అలంకరణలో సూర్యారావుపేట బాలత్రిపుర సుందరి అమ్మవారు



సరస్వతీదేవి అలంకరణలో మాధవనగర్‌లోని కనకదుర్గమ్మ



అన్నపూర్ణాదేవి అలంకరణలో దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



కూరాడలో దీపాలచెట్టు వద్ద దుర్గాదేవి అమ్మవారు



కరప శివాలయంలో జపమాల అవతారంలో పర్వతవర్ధినీదేవి

దుర్గమ్మ.. పాహిమాం

- ఆలయాల్లో భక్తుల కిటకిట

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా జపమాల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీనివాసా భజన మండలి కళాకారులు నిర్వహించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భగవతి నృత్యాంజలి వారి శాస్త్రీయ నృత్యప్రదర్శన, విఘ్నేశ్వర నృత్య నికేతన్ వారి నృత్య ప్రదర్శన అలరించింది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లా దేవాదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. మాధవనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయంలో నవావర్ణార్చన , కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరిదేవి లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సంతచెరువు కనక దుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.



కూరాడలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన

రాజరాజేశ్వరిగా ఐశ్వర్యాంబిక అమ్మవారు

కాకినాడ రూరల్: కాకినాడ శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు గురువారం సాయంత్రం భక్తులకు రాజరాజేశ్వరి అమ్మవారిగా దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీపీఠంలో పరిపూర్ణానంద స్వామిజీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి.

జపమాల అవతారమెత్తిన పర్వతవర్ధినీదేవి

కరప: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కరప శివాలయంలో పర్వతవర్ధినీదేవి జపమాల అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గాదేవి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కరప, పెద్దాపురప్పాడు, నడకుదురు, పెనుగుదురు, జెడ్.భావారం, వలసపాకల, వేములవాడ, పాతర్లగడ్డ, అరట్లకట్ట, వేళంగి, గొర్రిపూడి, వాకాడ, కూరాడ, కొరుపల్లి తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజ చేయించారు. అర్చకులు కొంపెల్ల చక్రధర్ కరప దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించి, కుంకుమార్చన చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శివాలయంలో పర్వతవర్ధినీదేవిని జపమాల అవతారంగా అలంకరించి, అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠ కరప మార్కెట్ యార్డు వద్ద దుర్గాదేవికి పూజలు నిర్వహించగా, విజయదుర్గా ఆటో యూనియన్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కూరాడలో దీపాలచెట్టు వద్ద పురోహితుడు నూకల నరసింహమూర్తి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన జరిగింది.

పథకాల తీరుపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులతో కలిసి ఇందులో పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, వైద్య సిబ్బంది ఖాళీల భర్తీ, సీజనల్ వ్యాధుల నివారణ, ఫీవర్ సర్వే వివరాలు, అంగన్‌వాడీ, పాఠశాలల కార్యకలాపాలు, సచివాలయాల అర్జీల పరిష్కారం, గడప గడపకూ మన ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులతో మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు వివిధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. రక్తహీనతను అధిగమించేందుకు కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంగా పని చేయాలని ఆదేశించారు. జగనన్న సురక్ష వైద్య శిబిరాలపై చర్చించారు. ప్రత్యేక కేసులను ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని చెప్పారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యాశాఖకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, సీపీవో పి త్రినాథ్, డీఎంహెచ్‌వో డాక్టర్ జె నరసింహనాయక్, డీఐవో డాక్టర్ కె రత్నకుమార్, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, డీఈవో జి నాగమణి, వివిధ విభాగాల అధికారులు, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి 6 వేల ఇళ్ల నిర్మాణం



కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణ ప్రగతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- కొమరగిరి లేఅవుట్ సందర్శించిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: డిసెంబర్‌నాటి కల్లా కొమరగిరి లేఅవుట్‌లో ఆరువేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు, కాంట్రాక్టర్లు పనిచేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. గురువారం ఆయన కాకినాడ సిటీ లబ్ధిదారులకు ఇళ్లు నిర్మిస్తున్న కొమరగిరి లేఅవుట్‌ను సందర్శించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని తెలుసుకున్నారు. హౌసింగ్ ఈఈ వై.శ్రీనివాస్, డీఈ సత్యనారాయణరెడ్డి, కాంట్రాక్టర్లు జేడీ పవన్‌కుమార్, గద్దేపల్లి దాసు, ఇతర ఏఈలు, సచివాలయ కార్యదర్శులుతో సమీక్షించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన నారాయణరెడ్డి ఇన్‌ఫ్రా సంస్థ ద్వారా షేర్వాల్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. కేవలం 10 రోజుల వ్యవధిలోనే ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే ఈ ప్రక్రియ పూర్తిగా కాంక్రీట్‌తో జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఒక్కో ఇంటికి రూ.3.60 లక్షల వ్యయమవుతోందని, షేర్ వాల్ టెక్నాలజీ ద్వారా రూ.2.50లక్షలకే వేగంగా నాణ్యతతో నిర్మాణానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ టెక్నాలజీతో కొమరగిరి లేఅవుట్‌లో నిర్మించిన మోడల్ హౌస్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. లబ్ధిదారుల ఆమోదంతో కనీసం 1500 ఇళ్లను ఈ ప్రక్రియలో నిర్మించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెస్‌తో విద్యార్థుల్లో మేధోశక్తి మెరుగు

పెద్దాపురం: విద్యార్థుల్లో మేధోశక్తి మెరుగుపడడానికి చెస్ క్రీడ దోహదం చేస్తుందని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం జనరల్ మేనేజర్ లంకా రవి అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీబీఎస్‌ఈ సౌత్ జోన్ చెస్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సభకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. జీఎం రవి మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా పెద్దాపురం శ్రీ ప్రకాష్‌లో సౌత్ జోన్ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెస్ పట్ల ఆసక్తి పెరిగేలా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఏపీ చెస్ చాంపియన్‌షిప్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ శర్మ మాట్లాడుతూ గతేడాది ఈ పోటీలు తమిళనాడులో జరిగాయని చెప్పారు. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రముఖ చెస్ క్రీడాకారిణి బొడ్డు ప్రత్యూష.. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో చదవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. చెస్ అసోషియేషన్ కార్యదర్శి భీమారావు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, చీఫ్ రిఫరీ జీవీ కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: కోర్టులో దాఖలు చేసే ప్రతి పిటిషన్‌పై అదనంగా రూ.20 న్యాయవాదుల సంక్షేమ నిధికి స్టాంప్ అతికించాలని తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాదుల పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్కా శ్రీనివాస్ కోరారు.

రాజస్థాన్ ల్యాబ్ పరిశీలనకు ఎరువు

- కమిషనర్‌ను కలిసిన ఢిల్లీ ప్రతినిధి బృందం

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ పర్యవేక్షణలోని ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంలో తడి-పొడి చెత్త నుంచి తయారయ్యే ఎరువును నాణ్యత పరిశీలన కోసం రాజస్థాన్‌లోని అనిల్ అగర్వాల్ ఎన్విరాన్‌మెంటల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపారు. ఈ మేరకు ఢిల్లీకి చెందిన సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌కు చెందిన ప్రోగ్రాం ఆఫీసర్ కైఫీ జావెద్, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అరవింద్‌తో ఉన్న ప్రతినిధి బృందం గురువారం ఇక్కడ ఎరువు తయారీ కేంద్రాన్ని సందర్శించింది. అక్కడి వెట్-డ్రై వేస్ట్‌ను ప్రోసెసింగ్ చేసే ప్రక్రియతో పాటు ప్లాంట్ కార్యకలాపాలను పరిశీలించింది. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంలో తయారవుతున్న ఎరువును పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపేందుకు నమూనా సేకరించారు. వ్యవసాయ అవసరాల కోసం వినియోగించే ఎరువులో కాలుష్య వ్యర్థాలు కలిసే అవకాశం ఉన్నందున, వాటి వల్ల కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకుని ఎరువు నాణ్యతను నిర్ధారణకు ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావును ప్రతినిధి బృందం కలిసి, పలు అంశాలపై చర్చించింది. ప్రస్తుతం దేశంలోని గురుగామ్, ఆగ్రా వంటి కార్పొరేషన్ల నుంచి మాత్రమే ల్యాబ్ పరీక్షలు నిర్వహించామని, దక్షిణభారతదేశంలో కాకినాడ, రాజమహేంద్రవరంలో చెత్త నుంచి తయారయ్యే ఎరువు నాణ్యతను నిర్ధారించనున్నట్టు చెప్పారు. వీటిపై త్వరలో డాక్యుమెంటేషన్ కూడా తయారు చేయనున్నటు వివరించారు. కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ ఇక్కడ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని అత్యంత సమర్థవంతంగా, నాణ్యత ప్రమాణాలతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్యదర్శి రాంబాబు, పర్యావరణ నిపుణుడు సైదా తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను కలిసిన సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ బృంద ప్రతినిధులు


ఘనంగా కేరర్స్ డే



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కాకినాడ క్రైం: కాకినాడ జేఎన్‌టీయూ ఆడిటోరియంలో గురువారం కేరర్స్ డే ఘనంగా జరిగింది. ఉమా మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, యూనివర్సిటీ వీసీ ప్రసాద్‌రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మానసిక, శారీరక వైకల్యంతో ఉన్నవారి పట్ల కేరర్స్ కుటుంబ సభ్యుల్లా వ్యవహరిస్తారన్నారు. కేంద్రం ప్రతినిధులను అభినందించారు.

సొంతింటి కలను సాకారం చేసుకోండి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న చింతా బుజ్జి

కరప: మంజూరైన గృహ రుణాలతో లబ్ధిదారులు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి అన్నారు. పెదకొత్తూరులో గురువారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కరపలోని సెంట్రల్ లేఅవుట్‌లో పెదకొత్తూరుకు చెందిన 123 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చారని, వెంటనే గృహ నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. సిమెంట్, ఐరన్, ఇసుక సిద్ధంగా ఉన్నాయని, బిల్లులు కూడా వెంటనే చెల్లిస్తారని పేర్కొన్నారు.

కాలుష్య రహితంగా ఎలక్ట్రిక్ బైక్‌లు

కాకినాడ: కాలుష్య రహితమైన ఎలక్ట్రిక్ బైక్‌లను వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ (నెడ్ క్యాప్) ఆధ్వర్యంలో స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ప్రదర్శనను కమిషనర్ సందర్శించారు. బైక్‌ల పనితీరు, ప్రయోజనాలను నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ ఆయనకు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రూ.1.33 లక్షల నుంచి రూ.1.85 లక్షల వరకు వివిధ మోడళ్లు, కంపెనీల్లో బైక్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు మూడు గంటల పాటు పూర్తిగా చార్జింగ్ పెడితే 100 కి.మీ. వరకు ప్రయాణించవచ్చని వివరించారు. నెడ్ క్యాప్ అధికారుల సమాచారం ప్రకారం ఆ చార్జింగ్‌కు రూ.40 మాత్రమే ఖర్చవుతుందన్నారు. అదే 100 కి.మీ.లకు పెట్రోల్ రూ.200కు పైబడి ఖర్చు అవుతుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు డౌన్ పేమెంట్ చెల్లించకుండానే వాయిదా పద్ధతిపై కొనే వెసులుబాటును నెడ్ క్యాప్ కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నెడ్ కాప్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ, నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ఏమిటీ నిర్లక్ష్యం?

- మున్సిపల్ కమిషనర్ అసహనం
- శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలకు షోకాజ్ నోటీస్
- ఇద్దరు కార్మికుల సస్పెన్షన్



పారిశుధ్య పనులపై సూచనలు ఇస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వంపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన ఒకటో సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం ప్రసాద్, శానిటరీ సెక్రటరీ జగన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరో ఇద్దరు కార్మికులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. బాహ్య పర్యటనలో భాగంగా కమిషనర్ నాగ నరసింహారావు గురువారం ఒకటో సర్కిల్ పరిధిలోని ఆర్టీవో జంక్షన్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో పారిశుధ్య నిర్వహణలో లోపాలను గుర్తించారు. చెత్త పేరుకుపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని గుర్తించి అక్కడి ఇన్‌స్పెక్టర్, సెక్రటరీ, కార్మికుల తీరుపై మండిపడ్డారు. ఇద్దరు కార్మికులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్‌ను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని ఏమాత్రం ఉపేక్షించబోనని కమిషనర్ స్పష్టం చేశారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా పారిశుధ్య విభాగానికి సహకరించి చెత్తను రోడ్లపై వేయరాదని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య సిబ్బంది, ప్రజల మధ్య సమన్వయం ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ జిలాని, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

టిడ్కో పెండింగ్ రుణాలు మంజూరు చేయండి

కాకినాడ: టిడ్కో ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే మంజూరు చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బ్యాంకర్లను కోరారు. గురువారం సాయంత్రం తన చాంబర్‌లో బ్యాంకర్లు, నగరపాలక సంస్థ అధికారులు, మెప్మా సిబ్బంది, సీవోలుతో టిడ్కో ఇళ్ల ప్రగతిపై సమీక్షించారు. తొలివిడత 1152 టిడ్కో ఇళ్లకు గాను 144 ఇళ్లకు 25 శాతం రుణాలు మంజూరు కావాల్సి ఉందన్నారు. ఆయా బ్యాంకర్లు నూరుశాతం రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు మెప్మా సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేసి, ఈ నెల 25లోగా రుణ ప్రక్రియ పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. టిడ్కో ద్వారా పెండింగ్‌లో ఉన్న 304 మంది లబ్ధిదారులకు చెందిన మార్ట్‌గేజ్ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రసాద్, మెప్మా ఏవో శివప్రసాద్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు, బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



మందుల కిట్లను అందజేస్తున్న నాయకులు, అధికారులు



పేర్లను నమోదు చేయించుకుంటున్న రోగులు

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. మండలం గురజనాపల్లిలో గురువారం సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. గురజనాపల్లి సచివాలయం పరిధిలోని 521 మంది జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చి తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ తదితర వైద్య నిపుణులు పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు రాసిచ్చారు. నేత్ర పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పౌష్టికాహార స్టాళ్లు నిర్వహించి, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్‌షీట్, మందులతో కూడిన బ్యాగులను నాయకులు, అధికారులతో కలిసి ఎంపీపీ శ్రీలక్ష్మి పేషంట్లకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు సమకూర్చిన హెచ్‌వోడీ



వైద్య ఉపకరణాలను అందజేస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ తన సొంత ఖర్చు రూ.50 వేలతో వివిధ వైద్య ఉపకరణాలను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు దానం చేశారు. ఈ ఉపకరణాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి డాక్టర్ విఠల్ గురువారం ఆమె ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్యకుమారి ఆయనను అభినందించారు.